క్లుప్తంగా

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో రూ. 12వేల విలువ గల నోటు పుస్తకాలను విద్యార్థులకు స్పందన సేవా సమితి, స్పందన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు తమ సంస్థ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. మెరిట్ స్టూడెంట్స్‌కు ప్రతి ఏటా బహుమతులను అందజేస్తామని సమితి సభ్యులు తెలిపారు. లీగల్ అడ్వైజర్ కల్యాణం నరసింహమూర్తి, సమితి సభ్యులు వి. విమలరాణి, ఎస్. భార్గవి, టిపి. శారద, భూపతిరాజు సత్యనారాయణరాజు, వెంకయ్యపంతులు, హెచ్ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీసీపీడీసీఎల్ విజయవాడ ఈఈగా రవీంద్రబాబు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీసీపీడీసీఎల్) విజయవాడ టౌన్ ఈఈగా పి. రవీంద్రబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ ఈఈగా విధులు నిర్వహిస్తున్న బీవీ సుధాకర్ మచిలీపట్నం బదిలీ అయ్యారు. ఏపీసీపీడీసీఎల్‌లోని స్కాడాలో ఇప్పటి వరకూ విధులు నిర్వహించిన రవీంద్రబాబు విజయవాడ టౌన్ ఈఈగా బదిలీపై వచ్చారు. ఈఈగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు నగరంలోని ట్రాన్స్‌కో డీఈలు, ఏఈలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్‌లో దేవీనగర్ ఫ్రెండ్స్ ఆధ్వర్యాన కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ సహకారంతో మంగళవారం వరద బాధితులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకుడు పెనుమత్స సత్యం పారిశుద్ధ్య కార్మికులు, వరద బాధితులకు దుస్తులు అందజేశారు. రామకృష్ణ, రాజారత్నం, కొండా, వెంకటేశ్వరరావు, వీర్రాజు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కండ్రిక ప్రాంతంలోని వరద బాధితులకు ఏపీ కమ్మవారి ఐక్య సేవా సమితి ఆధ్వర్యంలో వంట సామగ్రిని మంగళవారం అందజేశారు. బాధితులకు రెండు భోజనం ప్లేట్లు, గిన్నెలు, ప్లేట్లు, గ్లాసులతో కూడిన వంట సామాన్లు అందజేసినట్లు సమితి కార్యవర్గ సభ్యుడు పరుచూరి ప్రసాద్ తెలిపారు. వనజ, బుద్ధ రాజలింగం, సూర్యదేవర మురళి, పాల్గొన్నారు.

- సీపీఐ ఆధ్వర్యంలో 600 మంది వరద బాధితులకు దుప్పట్లు, టవల్స్, చీరలు పంపిణీ కార్యక్రమం సింగ్‌నగర్ కృష్ణాహోటల్ సెంటర్‌లో మంగళవారం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ బాధితులకు రుణ సహాయాన్ని తక్షణమే అందజేయాలని కోరారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీ భాస్కరరావు, లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గోపిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం వరద బాధితులకు చీరలు, దుప్పట్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. భవానిపురం వీఎంసీ కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మీ పాల్గొని బాధితులకు కిట్లు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు ఆసిఫ్, కార్పొరేటర్లు కోటిరెడ్డి, చైతన్యరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, శిరం శెట్టి పూర్ణ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ వద్ద పడిగాపులు



విజయవాడస్పోర్ట్స్: సింగ్‌నగర్ ప్రధాన రహదారిలోని అన్నా క్యాంటీన్‌ను మంగళవారం మధ్యాహ్నం 1.30 గంట వరకు తెరవకపోవడంతో ఆకలితో అక్కడికి వచ్చిన వారంతా ఎండలోనే నిలబడ్డారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న భోజనం పంపిణీ కార్యక్రమం క్యాంటీన్‌లో ప్రారంభం కావాల్సి ఉంది. నిర్వాహకులు వస్తారని ఎదురుచూస్తూ చాలా మంది పేదలు, వృద్ధులు ఎండలోనే వరుసగా నిలబడిన దృశ్యాలు అటుగా వెళ్లే వారిని కలిచివేశాయి.

బెదిరింపులపై కేసు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తాము కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఇంటిని విక్రయించిన వారే ఆక్రమించుకుని ఖాళీ చేయమంటే చంపుతామని బెదిరిస్తున్నారంటూ గుణదల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు నమోదయ్యింది. పోలీసుల కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా మహేంద్రవాడకు చెందిన తేతలి కొండారెడ్డి, 2013వ సంవత్సరంలో గుణదల రాంగోపాల్ థియేటర్ సమీపంలోని నరసయ్య వీధిలో కోట వెంకట దుర్గాప్రసాద్, అతని కుమార్తె కమ్మిలి నాగసామిక వద్ద ఇల్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇటీవల ఆ ఇంటిని అమ్మినవారు ఇంటి తాళాలు పగులకొట్టి ఆక్రమించుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద సాయం కోసం తప్పని తిప్పలు



వాంబేకాలనీలోని వార్డు సచివాలయంలో ఎన్యుమరేషన్ పరిశీలిస్తున్న తహసీల్దార్ శిరీష దేవి



వాంబేకాలనీలోని ఓ మెడికల్ షాపులో పాడైన మందులు, సరుకులు

- వార్డు సచివాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితులు
- నష్టపరిహారంపై స్పష్టత కరువు

మధురానగర్(విజయవాడసెంట్రల్)/పాయకాపురం(విజయవాడరూరల్)/విజయవాడస్పోర్ట్స్: వరద ముంపు ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వం నిర్వహించిన నష్టం అంచనాలపై వేలాది మంది పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముంపులో ఇళ్లు కోల్పోయి రోడ్డున పడ్డ తమ పేర్లను జాబితాలో చేర్చలేదని గగ్గోలు పెడుతున్నారు. కండ్రిక ప్రాంతంలో దాదాపు 70 శాతం మంది పేదల పేర్లు జాబితాలో లేవని పలువురు మహిళలు చెబుతున్నారు. దీంతో వరద ముంపు బాధితులకు తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన సాయం అందుతుందో లేదో తెలియక తికమక పడుతున్నారు. అసలు తమ పేరు లిస్టులో ఉందో లేదో తెలియక ఆందోళన చెందుతున్నారు. వార్డు సచివాలయాలకు వెళితే వలంటీర్‌లను అడగమంటున్నారని, వలంటీర్‌లను అడిగితే వార్డు సచివాలయాలకు వెళ్లాలని చెబుతున్నారని దీంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని వాపోతున్నారు. 11 రోజులపాటు వరద నీటితో అల్లాడిన తమకు న్యాయం జరుగుతుందో లేదో తెలియడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లతో పాటు దుకాణాలు కూడా సర్వం పాడయ్యాయని వాటికి నష్టపరిహారం ఇస్తారో లేదో.. ఇస్తే ఎప్పుడు ఇస్తారో.. ఎంత ఇస్తారో.. స్పష్టత లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు.

బాధితులందరికీ న్యాయం చేస్తాం..

వరద బాధితులందరికీ న్యాయం చేస్తామని నార్త్ తహసీల్దార్ సీహెచ్ శిరీష దేవి అన్నారు. స్థానిక వాంబేకాలనీలోని వార్డు సచివాలయంలో వరద ఎన్యుమరేషన్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము ఇప్పటికే సుమారు 50వేల మందిని అర్హులుగా గుర్తించామని పేర్లు నమోదు కాని వారి వివరాల కోసం దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఇప్పటి వరకు 10,447 దరఖాస్తులు అందాయని వాటిని కూడా పరిశీలించి న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

సాయం కోసం ఎదురుచూస్తున్నాం



బుడమేరు వరద నీరు మా ఇంట్లోకి రావడంతో పదిరోజులపాటు తీవ్ర అవస్థలు పడ్డాం. ఇంట్లోని వస్తువులు అన్నీ పాడయ్యాయి. ఇప్పుడు వరద సాయం ఇస్తామని అంటున్నారు. కానీ జాబితాలో మా పేర్లు ఉన్నాయో లేదో తెలియడం లేదు. ఎవరిని అడిగినా సరైన సమాధానం ఇవ్వడం లేదు. సాయం కోసం ఎదురు చూస్తున్నాం. – బి. శ్రీను, వాంబేకాలనీ

చేతిలో చిల్లిగవ్వ లేదు



వరద నీరు మా ప్రాంతాన్ని ముంచెత్తడంతో సర్వం కోల్పోయాం. వరద సాయం ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. ఇప్పటికే 15 రోజులుగా పనులు లేక చేతిలో చిల్లిగవ్వ లేక అవస్థలు పడుతున్నాం. ఇల్లు గడవడం కూడా కష్టంగా ఉంది. అధికారులు స్పందించి సత్వరమే సాయం అందించాలి. – సీహెచ్ కుమార్, వాంబేకాలనీ

రూ. 5 లక్షలు నష్టం

నాకు వాంబేకాలనీలో మెడికల్ షాపు ఉంది. వరద నీరు మా ఇంట్లోకి, దుకాణంలోకి వచ్చింది. ఇంట్లోని వస్తువులు అన్నీ పాడయ్యాయి. అలాగే దుకాణంలోని సుమారు రూ. 5లక్షల విలువైన మందులు, సరుకులు వరదలో పూర్తిగా నాశనం అయ్యాయి. ఒక్కసారిగా ఇళ్లు, దుకాణం నీట మునిగిపోవడంతో తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం త్వరగా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి. – లీల, వాంబేకాలనీ

డీజీపీకి మాల మహానాడు మెమోరాండం

- ఎమ్మెల్యేలు రఘురామ, నానాజీలపై చర్యలకు డిమాండ్
- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్



డీజీపిని కలిసి మెమోరాండం అందజేసిన అశోక్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీ లాగేసి అవమానపరచిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు, దళిత ప్రొఫెసర్‌పై దాడికి పాల్పడిన జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు పీవీ రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర డీజీపీని కలిసి మెమోరాండం అందజేసినట్లు తెలిపారు. ఈనెల 20వ తేదీన టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీని హేళన చేస్తూ తొలగించారని అన్నారు. అంబేడ్కర్‌ను అవమానించే విధంగా ప్రవర్తించిన టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇటీవల కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీలో దళిత ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావుపై దాడి చేసి దుర్భాషలాడిన జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీపైన కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు అశోక్ కుమార్ తెలిపారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, డా. బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు, కాకినాడ జిల్లా నాయకుడు మూలే మేఘరాజు, పైడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నానాజీ, రఘురామలను అరెస్ట్ చేయాలి

దళిత ప్రొఫెసర్‌ను దుర్భాషలాడటమే కాకుండా దాడికి పాల్పడిన జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజులను తక్షణమే అరెస్ట్ చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. జనసేన ఎమ్మెల్యే నానాజీ దళిత ప్రొఫెసర్‌పై దాడి చేశారని, టీడీపీ ఎమ్మెల్యే ఏకంగా బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచారన్నారు. వారిపై చర్యలు తీసుకోకపోతే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు దళితుల ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. దళిత బహుజన పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ఉప్పాడ రామచంద్రరెడ్డి, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ బాబు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రాచూరి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల జాబితాలో పిల్లల పేర్లు

పాయకాపురం(విజయవాడరూరల్): ముంపు ప్రాంతాల్లోని లబ్ధిదారుల జాబితాల్లో 30 శాతం పిల్లల పేర్లు ఉన్నాయి. బాధిత కుటుంబాల్లో పెద్దలుండగా పిల్లలు పేర్లు జాబితాల్లో కనిపించడం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. అలాగే ఎప్పుడో మృతి చెందిన వారి పేర్లు కూడా లబ్ధిదారుల జాబితాలో ఉండటంతో ఆయా కుటుంబ సభ్యులు ఇదెక్కడ విడ్డూరం అని ఆశ్చపోతున్నారు.

మురికి కంపు.. పాముల బెడద



విజయవాడస్పోర్ట్స్: వరద ముంపు ప్రాంతమైన కండ్రిక వాసులను డ్రెయినేజీ సమస్య, పాముల బెడద పీడిస్తోంది. నగర శివారులోని పల్లపు ప్రాంతం కావడంతో ఈ కాలనీల్లో పది రోజులకు పైగా వరద నీరు నిల్వ ఉన్నాయి. అధిక సంఖ్యలో పేదలు ఉండే ప్రాంతం కావడంతో పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించడం లేదని స్థానికులు చెబుతున్నారు. డ్రెయిన్‌ల్లోని చెత్తను తొలగించడం లేదని దీంతో దుర్వాసతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. డ్రెయిన్‌లలో చెత్త, చెదారం నిండిపోవడం, నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో పాములు ఎక్కువగా సంచరిస్తున్నాయని చెబుతున్నారు. రాత్రి సమయంలో పాములు ఇళ్లలోకి చొరబడి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'బొండా' కార్యాలయం వద్ద వరద బాధితులపై దాడి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎమ్మెల్యే బొండా ఉమా కార్యాలయం వద్ద ఆయన అనుచరులు మంగళవారం దాడికి దిగారు. వరద ముంపులో నష్టపోయిన తమకు ఏమైనా సాయం చేస్తారనే ఆశతో వచ్చిన వరద బాధితులపై రెచ్చిపోయారు. ఇదేం పద్ధతని ప్రశ్నించిన మహిళలపై బూతుపురాణాలు వినిపించారు. దీంతో సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే బొండా కార్యాలయ పరిసర ప్రాంతాల ప్రజలంతా ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. దీనిపై సింగ్‌నగర్ పోలీసులను వివరణ కోరగా ఎమ్మెల్యే కార్యాలయం వద్ద చీరలు పంచుతుండగా మహిళలు తోపులాట జరుగుతున్నట్లు తమకు ఫోను వస్తే సిబ్బందిని పంపామని, అటువంటి గొడవ ఏమీ జరగలేదని చెప్పుకొచ్చారు.

సర్వం కోల్పోయినా.. సాయం చేయరా?

- వరద బాధితులపై లాఠీ చార్జ్ చేయడం దారుణం
- బాధితులకు న్యాయం చేసే వరకూ పోరాడతాం
- వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్‌జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి



ముంపు బాధితులను పరామర్శిస్తున్న వెలంపల్లి, మల్లాది, ఆసిఫ్, భాగ్యలక్ష్మి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వరద ప్రభావిత ప్రాంతమైన భవానీపురం కరకట్ట ప్రదేశం(38వ డివిజన్)లో ముంపు బాధితులకు నష్టపరిహారం అందించేందుకు రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌తో సర్వే చేయించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో నష్టపరిహారం కోసం పెద్ద ఎత్తున ధర్నా చేసిన ముంపు బాధితులపై పోలీసులు లాఠీ చార్జ్ చేయటాన్ని ఖండిస్తూ మంగళవారం పార్టీ నేతలు మల్లాది విష్ణు, షేక్ ఆసిఫ్, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆ ప్రాంతంలో బాధితులను పరామర్శించారు.

చితకబాధించడమే సాయమా?

ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ వాస్తవంగా ఇళ్లు మునిగిపోయి సర్వం కోల్పోయిన బాధితులు సాయం కోసం రోడ్డెక్కితే పోలీసులతో లాఠీ చార్జ్ చేయించడం దుర్మార్గమన్నారు. బాధితులను పోలీసులతో చితకబాదించడమేనా వారికిచ్చే వరద సాయం అంటూ నిలదీశారు. వరదల కారణంగా వివిధ ప్రాంతాల నుంచి సుమారు వెయ్యి కోట్ల రూపాయలపైబడి విరాళాలుగా వచ్చాయని, వాటిని ఖర్చు చేసినా బాధితులకు న్యాయం జరిగుతుందని పేర్కొన్నారు. మునిగిన ఇళ్లల్లోని బాధితులకు ఎన్యూమరేషన్ చేయకపోవడమే కాకుండా స్థానిక కార్పొరేటర్‌పై నిందలు వేస్తూ అధికారులను తప్పుదారి పట్టించడం దుర్మార్గమన్నారు. ఎన్యూమరేషన్ చేసే విషయంలో సచివాలయ సెక్రటరీలు ఉండగా కార్పొరేటర్లకు ఏం సంబంధం అని ప్రశ్నించారు. బాధిత మహిళలపై పోలీసులు లాఠీ చార్జ్ చేస్తే దానిపై స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరిగానీ, ఎంపీ కేశినేని చిన్నీగానీ స్పందించక పోవడం దారుణమని మండిపడ్డారు. వరద బాధితులకు నష్టపరిహారం అందించకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేయటం చంద్రబాబుకే చెల్లిందన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా వైఎస్సార్ సీపీ ప్రజలకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఇళ్లు మునగలేదని ఎలా అంటారు..?

సెంట్రల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ నాలుగు రోజులపాటు మునిగిపోయిన ఇళ్లల్లోనే మగ్గితే వారి ఇళ్లు మునగలేదని అధికారులు చెప్పటం సిగ్గుచేటన్నారు. బాధితులకు నష్టపరిహారం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బాధతో ధర్నా చేసిన బాధితులపై పోలీసులు లాఠీ చేయడమేంటని ప్రశ్నించారు. ఇంత జరిగినా ప్రజాప్రతినిధులు స్పందించక పోవడం చూస్తుంటే వారే వెనుక ఉండి ఇదంతా జరిపించారా అన్న సందేహం కలుగుతుందన్నారు.

తూతూమంత్రంగా వివరాల నమోదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ప్రభావిత ప్రాంతం అజిత్‌సింగ్‌నగర్‌లో బాధితులకు స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో చేపట్టిన నష్ట పరిహారం అంతా అవకతవకలు చోటుచేసుకోవడంతో ప్రభుత్వం సోమవారం ఆ బాధ్యతలను రెవెన్యూ విభాగ అధికారుల చేతికి అప్పగించింది. దీంతో వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది సోమవారం అంతా తమ పరిధిలోని బాధితుల వివరాలను నమోదు చేసుకున్నారు. అయితే మంగళవారం మళ్లీ స్పెషల్ ఆఫీసర్‌లంటూ కొంతమందిని కేటాయించడంతో సచివాలయాల వద్ద వారు వివరాల నమోదు తూతూమంత్రంగా చేసి చేతులు దులుపుకొని వెళ్లిపోయారు.

రామాలయ రథం దగ్ధం ఘటన కలచివేసింది

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): అనంతపురం జిల్లా హనకనహల్ గ్రామంలో రామాలయ రథం దగ్ధం ఘటన కలచివేసిందని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడటంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని విమర్శించారు. సనాతన ధర్మమంటూ గంటల కొద్దీ ఉపన్యాసమిచ్చే ప్రభుత్వ పెద్దలు దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. చంద్రబాబు పాలన హిందువులకు గడ్డుకాలమని.. ఈ ప్రభుత్వంలో ఆలయాల ప్రతిష్ట మసకబారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయాలు, ఆలయ ఆస్తులపై దాడులు విపరీతంగా పెరిగాయని అన్నారు. అనంతపురం ఘటనకు పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ శాఖ వహించాలని.. దోషులను వీలైనంత త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మరోవైపు తిరుమల తిరుపతి హిందువుల ఆధ్యాత్మిక రాజధాని అని అటువంటి పుణ్యస్థలంలో స్వామీజీలు నిరసనలు చేపట్టడం సరికాదన్నారు. దీనిపై పోలీసు యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని.. భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు.

వరద బాధిత కార్మికులను ఆదుకోవాలి

కలెక్టర్‌కు సీఐటీయూ ప్రతినిధుల వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వరద ముంపు ప్రాంతాల్లోని కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ ప్రతినిధులు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ జి. సృజనను కలిసి వినతి పత్రం సమర్పించారు. వరద బాధితులకు సంబంధించి 12 డిమాండ్లు పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా వివిధ తరగతుల కార్మికులు తమ పనులు కోల్పోయారని, ఆటో, ట్రక్, ట్యాక్సీలు, బైక్‌లు దెబ్బ తిన్నాయని, వివిధ ఫ్యాక్టరీలు, సంస్థలు, గోదాములు, వర్తక, వాణిజ్య సంస్థలు, షాపులు మునిగిపోవడంతో కార్మికులు పని కోల్పోయారని కలెక్టర్‌కు వివరించారు. పనులు కోల్పోయిన కార్మికులందరికీ ప్రభుత్వం రూ. 10వేలు ఆర్థిక సాయం, వరదల్లో మునిగిన ఇళ్లకు రూ. 50వేలు నష్టపరిహారం ఇవ్వాలి కోరారు. ఆటోలు, ట్యాక్సీల రిపేర్లకు రూ. 25వేలు, బైక్‌లకు రూ. 10వేలు, మున్సిపల్ కార్పొరేషన్ పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులకు 15 రోజులపాటు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీఐటీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కె.దుర్గారావు, కార్యదర్శులు ఎ. కమల, బి.వెంకటేశ్వరరావు, నాయకుడు యం. సోమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ప్రజలకు ఫార్మసీ రంగంపై అవగాహన అవసరం

ఏపీ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ విలియంకేరి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విలియం కేరి, పక్కన ప్రిన్సిపాల్ సునీత తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజలు ఫార్మసీ రంగంపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.విలియమ్ కేరి అన్నారు. వరల్డ్ ఫార్మసిస్టు డే సందర్భంగా మంగళవారం నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో సదస్సు జరిగింది. ఈ కళాశాల ఫార్మాస్యూటికల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సును ముఖ్యఅతిథి డాక్టర్ విలియం కేరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన దేశంలో ఫార్మసీ రంగ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. విదేశాల్లో ఉన్న ఉత్తమ విధానాలను ఫ్యార్మసిస్టులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ. సునీత మాట్లాడుతూ కోవిడ్ తర్వాత ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగిందన్నారు. ప్రభుత్వాలు ఆరోగ్య సిబ్బందిని నియమించుకోవడం ద్వారా ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాయన్నారు. జిల్లాకు చెందిన 200 మందికిపైగా ఫార్మసిస్టులు హాజరు కాగా, వారికి ఫార్మసీ రంగంలో వచ్చిన నూతన మార్పులపై శిక్షణ ఇచ్చారు. ఎం. విజయలక్ష్మి, డాక్టర్ జి. రమణ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో హిందీ తప్పనిసరి

డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



మాట్లాడుతున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అధ్యక్షతన 188వ అధికార భాష అమలు కమిటీ సమావేశం మంగళవారం డీఆర్ఎం కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా కవి రామధారీ సింగ్ దినకర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన రచించిన అత్యంత ప్రసిద్ధ పుస్తకంలోని 'రశ్మిరథి' నుంచి కొన్ని కవితలను చదివి వినిపించారు. అనంతరం డీఆర్ఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు వారి రోజువారి విధుల్లో అధికారిక భాష హిందీని ఉపయోగిండం తప్పనిసరన్నారు. డివిజన్‌లో అధికారిక భాష అమలులో హిందీ విభాగం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఆర్ఎం, అడిషనల్ ముఖ్య రాజభాష అధికారి పీఈ ఎడ్విన్ డివిజన్‌లో హిందీ భాష అమలులో సాధించిన పురోగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు, రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ సారిబాల, పలు బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురంలో మంగళవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని వస్తువులన్నీ అగ్నికి కాలిపోయాయి. వివరాల్లోకి వేళితే.. రామకృష్ణాపురానికి చెందిన డాక్టర్ బాలాజీ భార్య సుకన్యతో కలిసి నివసిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం బాలాజీ ఇంటికి వచ్చి భోజనం చేసి ఏసీ ఆన్ చేసుకుని నిద్రపోయారు. ఎదురుగా ఉన్న దుకాణదారుడు మీ ఇంట్లోంచి కాలిన వాసన వస్తోందని ఇంటి బయట ఉన్న సుకన్యతో చెప్పాడు. దీంతో ఆమె వెళ్లి చూడగా అప్పటికే ఇళ్లంతా పొగ వ్యాపించి ఉంది. సుకన్య నిద్రమత్తులో ఉన్న బాలాజీని బయటకు తీసుకువచ్చింది. వెంటనే ఏసీ పేలి ఇళ్లంతా మంటలు వ్యాపించాయి. మంటలకు ఇంట్లోని మంచాలు, దివాన్‌కాట్, డ్రెసింగ్ టేబుల్, డైనింగ్ టేబుల్‌తో పాటు వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.


ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

షార్ట్ సర్క్యూట్‌తో సర్వం కోల్పోయిన డాక్టర్ బాలాజీ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు హామీ ఇచ్చారు. రామకృష్ణాపురంలో అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుడు డాక్టర్ బాలాజీని పరామర్శించి ఆదుకుంటామని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీసు స్టేషన్ పరిధిలో సీఐ పి.కృష్ణమోహన్, సిబ్బంది, యాంటీ నార్కొటిక్ డ్రగ్స్ డాగ్‌స్క్వాడ్‌తో కలిసి మంగళవారం గంజాయి తనిఖీలు నిర్వహించారు. వాంబే కాలనీ, రాజీవ్ నగర్, కండ్రిక తదితర ప్రాంత ప్రధాన సెంటర్లలో చేరువ వాహనం ద్వారా చిన్నారులు, మహిళలపై జరిగే అఘాయిత్యాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఎస్పీబీ సినీ రంగసేవలు వెలకట్టలేనివి



బాలు చిత్ర గీతాల కార్యక్రమంలో వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు

విజయవాడ కల్చరల్: సినీ నేపథ్య గాయకుడు బాల సుబ్రహ్మణ్యం సినీరంగ సేవలు వెలకట్టలేనివని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై మంగళవారం బాలు సినీ సంగీత వారోత్సవాల్లో భాగంగా సినీసంగీత విభావరి, కళాకారులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ బాల సుబ్రహ్మణ్యం అనేక భారతీయ భాషల్లో పాటలు పాడారని అన్నారు. విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్‌రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాల సుబ్రహ్మణ్యం పేరుతో జాతీయ పురస్కారం ఏర్పాటు చేయాలని కోరారు. గాయకులు సుశీల్ కుమార్, భారతి, ఝాన్సీ, చంద్రశేఖర్ బాలు పాడిన చిత్ర గీతాలను ఆలపించారు. శింగంశెట్టి చంద్రశేఖర్, ప్రసూనారామన్, గోళ్ల నారాయణరావు, మారుతీప్రసన్న, పరచూరి విజయలక్ష్మి పాల్గొన్నారు.